

# ఖులాసా పురుషుడు

బెహరా వెంకట సుబ్బారావు

ఆఫీస్‌నుంచి యింటికి వస్తూంటే సిద్ధంగా ఉన్నారు రఘురాంగారు. స్టార్ట్ స్కూటరు ఎక్కి బయలుదేరడానికి చేయలేదు. ఇంట్లోకి చూస్తున్నారు.

భార్యామణి రమణికోసం. కొత్త సినీమా రిలీజ్ అయింది కాబట్టి సినీమా ప్రోగ్రాం కాబోలు అనుకొన్నా. నా అర్ధాంగి అనూరాధ మా వాటా గుమ్మంలో నిలబడి అతడ్నీ, అతని స్కూటర్నీ చూస్తోంది. నన్ను గమనించినా మాట్లాడే పరిస్థితిలో లేదు. పక్కకు జరిగింది, నేను లోపలికి పోడానికి వీలుగా. ఆఫీసునుంచి రాగానే నాకు కాఫీ తాగడం అలవాటు. బట్టలు మార్చుకొని ఓసారి వీధిగుమ్మంలోకి చూసా. అనూరాధ అలాగే నిలబడి చూస్తోంది. ఫ్లాస్కులోని కాఫీ గ్లాసులో పోసుకొని పెరటి గుమ్మంలో నిలబడి అరటి మొక్కలవైపు చూస్తూ తాగడం మొదలుపెట్టా. రెండురోజులక్రితం వేసిన గాలికి ఏపుగా వేసిన గెలతో పెద్ద అరటిచెట్టు పడిపోయింది. గెల కొట్టేసి యింట్లో పెట్టింది అనూరాధ. చెట్టు కొట్టి అవతల పారేయడం నా వంతు. రేపు ఉదయం తప్పకుండా కొట్టిపారేయాలి అనుకొన్నా ! రఘురాంగారు తిరిగి యింట్లోకి వచ్చారు కాబోలు ! ఆ దంపతుల మాటలు పక్కగదిలోంచి స్పష్టంగా వినబడుతున్నాయ్.

"ముష్టి యాభై రూపాయిలకోసం మొహం చూసుకొన్నారు ! ఈ చీర నా.కేమీ నచ్చలేదు ! మీ యింజనీర్ భార్య లలిత చూడండి ! రెండువందల యాభై పెట్టి కొనుక్కుంది ! ఎంత భాగుందని!" విసుక్కుంటోంది రమణి.

"ఇదిమాత్రం తక్కువా ? రెండు వందలు తగలేసావ్ !"

"మా గొప్ప ఖరీదుపెట్టి కొన్నారు ! మరో యాభై పారేస్తే లలితలాంటి చీర వచ్చి ఉండేది ! మీ కక్కుర్తి పోనిచ్చుకున్నారుకాదు !" సణుగుతోంది

"సినీమా టైమ్ అయిపోతోంది ! తొందరగా తెములు !"

"నాకూ అలాంటి చీర కొంటానంటేనే వస్తా." మారాము చేస్తోంది.

"సరే ! వచ్చే నెల్లో కొంటా ! క్విక్ !"

తొందరచేస్తూ ప్రామిస్ పారేసా డాకులాసాపురుషుడు.

"అంత తొందరెందుకండీ ? మూడు రోజులు ముందుగానే కొనేసారుగదా టిక్కెట్సు !"

"టికెట్సు మనదగ్గరుంటే సీట్లు రిజర్వుఅయి ఉంటాయి గానీ సినీమా బిగిన్‌చెయ్యడం మాత్రం మానదు ! ఇంటర్వెల్ దగ్గరనుంచే చూడాల్సి వస్తుందేమో !" విసుక్కుంటున్నారు రఘురాంగారు.

"వచ్చేస్తాగానీ ముందు మీ రవతలికి పదండి !"

ఆజ్ఞాపించింది రమణి. చీర కట్టుకొంటోంది కాబోలు !

వాళ్ళు బయలుదేరడానికి యింకా టయిము పడుతుంది. ఆ విషయం అనూరాధకి తెలీక యింకా గుమ్మంలోనే

నిలుచుంది, ఆ ముచ్చటయిన నవయువ జంటను చూడ్డానికి. కాఫీ గ్లాసు కింద పెడుతూ కేకేసాను. ఆమెకు వినబడి నట్లు లేదు. పార్కునించి పిల్లలు కూడా వచ్చేసారు—బాగా పొద్దుబోయింది.

"అమ్మను పిలూ బాబూ !" అన్నా గట్టిగా.

వాడు పోయి అనూరాధని చేయి పట్టుకొని లాక్కొచ్చాడు.

"ఎందుకూ ? కాఫీ తాగేసారు గదా !"దూకుడుగా వస్తూ కస్సుమంది. నేనేదో అనబోయేలోగా ఆవే అందు కొంది.

"ఓ ముద్దా, ముచ్చటా ? పెళ్ళయి ఆరేళ్ళయినా అనుభవించింది ఒక్కటీ లేదు ! పిల్లలుమాత్రం పుట్టారు నలుగురు !"

విసుక్కొంది గట్టిగానే. నే నేమీ మాటాడలేదు. ఏమయినా అంటే ఆమెకి మరీ ఫోర్సు ఎక్కుతుంది. అయినా ఆమె ఊరుకోలేదు. "నాలుగు చీరలూ, నాలుగు నగలూ ఉంటే సరా ? ఓ గాస్ స్టవ్వయినా తెచ్చి మొహాన పడేయ మన్నా ! డబ్బున్నా అనుభవించే అదృష్టం ఉండాలి ! నాన్నగారూ, పెద్దన్నయ్యా నా పెళ్ళయేవరకూ నిద్ర పోలేదు ! పదిహేనువేలు తగలేసి సంబంధం చేసారు ! ఏదో అందలం ఎక్కి సుఖపడిపోతానని..."

ఇంకా ఏవేవో ఏకరువుపెట్టి తననీ, తనను కన్నవాళ్ళనీ, నన్నూ తిట్టి పోసింది. ఆమె శృతిమించినందుకు నాకు కోపం వచ్చింది. అప్పుడే కాదు అప్పు డప్పుడు వస్తూ ఉంటుంది ఆమె మాటలకి. ఈ మధ్య అంటే మా యింట్లో ఆ దంపతులు అద్దెకి దిగినప్పటినుంచీ ఆమె సాధింపులూ, చీత్కారాలూ మరీ ఎక్కువయ్యాయ్.

మా యింట్లో అద్దెకు దిగిన రఘురాం గారికిగానీ, వారి అత్తవారికిగానీ ఏపాటి ఆస్తిపాస్తు లున్నాయో తెలీదు ! నే నెప్పుడూ అడగనూలేదు కూడా. వారు యిదివరలో సీతమ్మధారలో ఉండేవారు. టౌనుకి దూరం అని ఊళ్ళోకి మారారు. అతనికి కాల్టెక్స్‌లో ఉద్యోగం. జీతం వెయ్యిరూపాయ లుంటుందని వినికిడి. అద్దె నూటముప్ఫయి ముట్టజెబుతున్నారు ... చాలా ఖరీదైన బట్టలే కడు తూంటారు. వాళ్ళింట్లో ఆపిలూ్స, బత్తా యిలూ, ద్రాక్షపండ్లూ ఎప్పుడూ స్టాకుం టాయ్ ! ఏ బాదరబందీ లేదు. అత్యా ధునిక విలాసజీవితం అనుభవిస్తున్నారు. వారు సమస్త సౌకర్యాలూ సమకూర్చు కొని అనుభవిస్తున్నారనీ, నేను వట్టి పిసినారివాడిననీ, డబ్బును దాచడమే గానీ అనుభవించననీ, తక్కినవారిని అనుభవించనీయననీ మా ఆవిడ భావన. ఆ భావంతోనే నన్ను ఈసడించు కొంటుంది. దానికి తోడు ఈ మధ్య రఘురాంగారు స్కూటరు కొన్నారు...

ఆ స్కూటర్ను చూసినప్పుడల్లా అనూరాధ నన్ను తిట్టుకొంటుందని నా అనుమానం. ఎందుచేతనంటే నన్నూ ఓ స్కూటరు కొనమని అడిగింది, అర్థించింది. ఆఖరికి ఓనాడు సత్యాగ్రహం చేసింది కూడా. ఎంతకూ లొంగకపోవడంతో సహాయ నిరాకరణోద్యమం నడిపింది కొన్నాళ్ళు.

మనకు పిల్లలున్నారనీ, వాళ్ళలా డబ్బుని మంచినీళ్ళప్రాయంగా ఖర్చు చేస్తే ఆఖరిదశలో అగచాట్లు పడాల్సి వస్తుందనీ, అలాగని కనీసావసరాలు, సౌకర్యాలూ మానుకోనవసరంలేదనీ, అదనీ, యిదనీ ఏవేవో చెప్పి కొన్నాళ్లకి ఆమెను వొప్పించా. రఘురాంగారు దిగిన కొంతకాలంవరకూ సుమారు ఆరు నెల్లవరకూ మా రెండు కుటుంబాలూ ఒక్కటిగానే నడిచాయ్. మా పిల్లలు ఎప్పుడూ వాళ్ళింట్లోనే ఉండేవారు. తినడానికి అవీ యివీ యిచ్చేవారేమో వాళ్ళని వదిలేవారు కాదు. వాళ్ళని చదివించి ఆడించేది రమణి– మా ఆఖరి అబ్బాయికి ఏడాది వెళ్ళింది. వాడంటే ఎంతో ముద్దు రమణికి. వాళ్లకి పిల్లలు లేకపోవడం కారణం అయి ఉండొచ్చు !

అనూరాధా–రమణీ వాళ్ళిద్దరి మధ్యా ఏ మొచ్చిందో మరి! ఓ సుముహూర్తాన ఉదయం భోజనం వడ్డిస్తూ అంది అనూరాధ.

"చూసారా? దాని కెంత పొగరో !" అని

"ఎవరూ ?" అన్నట్లు తలెత్తి చూసా ఆమెవైపు.

"ఎంత డబ్బుంటేమాత్రం అంత పొగరు కూడదు ! డబ్బుని చూసి వాణ్ణి ప్రేమించింది. దాని వగలూ, వయ్యారం చూసి దాని వల్లోపడ్డాడు ! దానికేముంది దిబ్బ !"

నా కేమీ అర్థంకాలేదు.

"ఎవర్ని గురించి మాట్లాడుతున్నావ్ ?" అడిగా.

అనూరాధ ఆగ్రహానికి గురయిన అబల ఎవరో తెలీక తికమక పడ్డా. ఊహించుకోలేకపోయా.

"ఈవేళ ఉదయం మన రెండోవాడు పాపం సరదాపడి స్కూటరుమీద కూర్చుంటే రెక్కపట్టుకొని కిందకి లాగేసింది చూసారా దాని కెంత పొగరో !"

అప్పుడు అర్థమయింది - అంత ప్రాణ స్నేహితురాలు అంత ఆగ్రహానికి ఎందుకు గురయిందో ! అనూరాధ చెప్పింది సరైన కారణంగా తోచలేదు. మరొకటి ఏదైనా ఉండి ఉండాలి.

"అసలు ఏమయింది ?" పక్క గదిలో ఉన్న రమణి వింటుందేమోనని మెల్లిగా అడిగా.

"ఆ రంకులాడి యింట్లో యింకా ఎందుకుంటుంది ! మొగుడు అలా

ఆఫీసుకు పోగానే యిలా వుడా యిస్తుంది. క్లబ్‌లో ఏదో మీటింగుందిట! పోయింది !"

అంది గట్టిగా, నిర్భయంగా, నా అనుమానాన్ని నివృత్తి చేస్తూ.

"అసలేం జరిగింది ?" మరలా అడిగాను, వివరంగా చెబుతుందని.

"ఆ రఘురాం స్కూటర్ని తుడుచు కొంటున్నాడు ! (ఏకవచన ప్రయోగం చేసింది మొట్టమొదటిసారిగా. కోపంలో అయితే అవ్వచ్చు !) మనవాడేమో సీటుమీదకి ఎక్కబోయాడు ! ..."

సగంలోనే అందుకొన్నా.

"అవును మరి ! తుడుస్తూంటే అడ్డుగా ఉన్నాడని దింపింది కాబోలు!" అని అన్నానో లేదో చ(క్ర)ుమని అందుకొంది.

"మీరు చూసినట్టు చెప్పకండి! నాకు వళ్ళుమంట ! అడ్డు లెమ్మంటే లేవడూ! రెక్కపట్టుకొని లాగాలా ?" అంది కోపం ఎక్కువ చేసుకొంటూ.

ఆ విషయం అప్పటితో ఆపుచేస్తే మంచిదనిపించింది. అందుకే నేనేమీ మాట్లాడలేదు. చెప్పి, చెప్పి ఆమే ఊరు కొంటుంది అనుకొన్నా. ఆమె రమణి గురించి చాలా విషయాలు ఏకరవు పెట్టింది. ఎప్పుడు సేకరించిందో లేక ఊహించిందో మరి !

వాళ్ళది ప్రేమ వివాహంట ! పైగా కులాంతర వివాహంట ! (?) కాలేజీలో యిద్దరూ ప్రేమించుకొన్నార్ట ! రమణి పుట్టింటివారు చాలా బీదవారుట! రమణి క్యారక్టరు కూడా మంచిదికాదుట పూర్వం. బంగారంలాంటి కుర్రాడు దాని వల్లో పడిపోయాట్ట. ఇదీ ఆమె చెప్పిన విషయాల సారాంశం! రఘురాం గారి గురించి మాత్రం ఏమీ చెప్పలేదు. ఆ రోజునుంచీ ఆ వాటా పెంకులుమీద వాలిన కాకి మా వాటా పెంకులుమీద వాలడానికి వీల్లేదు ! (ఇల్లు ఒక్కటే కాబట్టి) అంతవరకూ మా రెండిళ్ళకీ పనిచేసే పనిమనిషి, పాలుపోసే పాల వాడూ, చాకలీ అందరూ మారిపోయారు. అనూరాధ వాళ్ళ ఐశ్వర్యం చూసి అసూయపడుతోందని నా అనుమానం. ఇంట్లో పనిమనుషులు యిద్దరవడంవల్ల కొన్ని కొన్ని చీకాకులు వస్తూండేవి. పనిమనుషుల తగవుల్లో యిల్లాండ్రు తలదూర్చేవారు. ఆ తగవులు మా యిద్దరి దగ్గరికీ వచ్చేవి జడ్జిమెంటు కోసం. అయితే నాలాగే రఘురాంగారు కూడా పట్టించుకొనేవారు కాదు. ఆఖరుకు అనూరాధ ఆఖరి అస్త్రం ప్రయోగించడానికి ఉద్యుక్తురాలయింది.

ఓనాటి రాత్రి అంది.

"వాళ్ళని యిల్లు ఖాళీచెయ్యమని చెప్పాలండీ !" అని.

ఆ మాట ఎప్పుడో ఒకప్పుడు అంటుందని నాకు తెల్సు. ఆమె

సూచనకు తగువిధంగా జవాబు చెప్పా లనుకున్నా.

"మొన్న మున్సిపాలిటీవాళ్ళు వచ్చి వాళ్ళని ఏమైనా ఎంక్వయరీ చేసారా ?"

"ఆఁ అడిగారు ! అప్పుడు ఆ బడ్డూ స్క్వేర్ యింట్లోనే ఉన్నాడు!"

రఘురాంగారికి పెట్టిన పేరుకి నవ్వొచ్చింది ! ఆపుకొన్నా.

"ఏమని చెప్పారు ?"

"అరవై రూపాయిలు అద్దె యిస్తున్నా నని చెప్పాడు ! వాళ్ళు నమ్మలేదు కాబోలు! ఇంత వాటాకి అరవై రూపాయి లేనా అద్దె అని రెట్టించారు !"

"అప్పు డేమన్నారు ?"

"వారు మాకు దగ్గర బంధువులు. ఎంతో కొంత యివ్వమన్నారు! అరవై రూపాయిలు యిస్తున్నాం ! అని చెప్పాడు !"

"చూసావా ! ఆయ నెంత మంచివాడో ! అలా చెప్పమని మనం ఆయనతో చెప్పామా ? అనవసరంగా రమణితో పేచీకి దిగుతున్నావేమో అనిపిస్తోంది !"

నా మాటలకి అనూరాధకు రోషం వచ్చింది.

"తీరి కూర్చుని నేనే తగువుపెట్టు కున్నానంటారు ! అనండి ! మీరూ నన్నే అనండి ! దిక్కుమాలిన సంత ! అద్దెకు కక్కుర్తిపడి నెత్తిమీద కుంపటి తెచ్చి పెట్టుకొన్నా ! ఇంట్లోవాళ్ళకీ ఊళ్ళో వెధవలకీ లోకువై పోయాను!"

రాగాలు ప్రారంభించింది.

"నువ్వే కదా దింపావ్ ! మొగుడూ పెళ్ళాం ! యిద్దరే ! చిన్నకుటుంబం పెద్ద అద్దె ! పైగా మర్యాదగా అణకువగా కనిపిస్తున్నా రన్నావ్ !" అన్నాను, నా తప్పు లేదన్నట్లు. నా అదృష్టవశాత్తూ అనూరాధే అద్దె మాట్లాడి వాళ్ళని దింపింది.


"అందుకే ఏడుస్తున్నా !" అంటూ లేచిపోయింది.

ఈ సమస్య ఎలా పరిష్కారం అవుతుందిరా భగవంతుడా అనుకొంటూ ఆలోచిస్తున్నా మంచంమీద పడుకొని పైకి చూస్తూ. ఏమీ మార్గం తోచలేదు. పేపరు తీసుకొని చదవడం మొదలు పెట్టా. ఇంటి పనులన్నీ ముగించుకొని వచ్చింది అనూరాధ. నా మంచానికి దగ్గరగా కుర్చీ లాక్కొని కూర్చొంది. పేపరు చాటునుంచి గమనించా. మళ్ళా ఆ విషయం ఎత్తుతుందని తెల్సు.

"ఎలాగయినా ఖాళీ చేయించాలండీ !" అంది.

నే నేమీ మాటాడలేదు. అలాగని పేపరూ చదవలేదు ... నా ధోరణి ఆమెకి నచ్చలేదు.

"ఆ దిక్కుమాలిన పేపరు తీయండీ! ఎక్కడికి పోదు !" అంటూ నా చేతిలోని పేపర్ని లాగి కిందపడేసింది.




"ఆఁ ఏవిటంటావ్ ?" అడిగా కోపం తెచ్చుకోకుండా.

"ఉదయంనుంచీ పోరుతున్నా మీ కొక్క మాటా బుర్ర కెక్కలేదన్న మాట ! అవునులెండి నా బాధ మీ కెలా తెలుస్తుంది ! అసలు నా మాటకి ఎప్పుడు విలువుండి యేడిసింది ఈ యింట్లో !"

సాగదీసింది. ఇక లాభంలేదని రాయబారానికి దిగాలనుకొన్నా.

"ఏ వంక పెట్టి ఖాళీ చేయించ మంటావ్ చెప్పు ? అద్దె ముందునెల్లోనే వారంరోజులు ముందుగానే యిచ్చేస్తు న్నారు. రెండునెల్ల అడ్వాన్సు నీ దగ్గర డిపాజిట్ ఉంది! ఇల్లు పాడుచేస్తున్నారా అంటే అదీలేదు." అన్నా, ఏమనాలో బోధపడక.

కొన్ని నిముషాలు మౌనంగా గడిచి పోయాయ్. అనూరాధ ఏదో ఆలో చిస్తోంది కాబోలు !

"అద్దె మరో యాభై పెంచా మనండి! చెప్పా చెయ్యకుండా ఖాళీచేసి పోతారు !"

సూచించింది ఎంతో తెలివైనదానిలా. నాకు నవ్వొచ్చింది.

"అలాగే రఘురాంగారితో మాటా డుతా ! ఈ విషయం రమణి దగ్గర అనకు !"

అంటూ గోడవైపు తిరిగాడు పడుకొనే ఉద్దేశంతో...

"దాంతో మాటాడ్డానికి నాకేం ఖర్మ !"

అంటూ తనూ లేచిపోయింది.

* * *

మర్నా డుదయం రఘురాంగారు నూతిదగ్గర స్నానంచేస్తూంటే పనిగట్టుకొని వెళ్ళి కబుర్లలోకి దింపా. ఆ మాటా, ఈ మాటా అయాక అసలు విషయంలోకి మాటలు మార్చా...

"ఈ హవుస్ టాక్సెస్ మరీ ఘోరంగా పెంచేసారండీ !" అన్నా రియాక్షను ఎలా ఉంటుందోఅని చూస్తూ.

"అవునండీ ! మా కొలీగ్ కూడా గోలపెడుతున్నాడు !" అన్నారు.

"ఇల్లు అద్దె కిచ్చుకొనేకన్నా అమ్ముకొని ఏ చెట్టకిందనో కాపరంపెడితే మంచిదనిపిస్తోంది !"

నా మాటకు ఆయన వెంటనే అందుకొన్నారు.

"బాబ్బాబూ ! ఇల్లు అమ్మడంగానీ, ఖాళీచెయ్యమనడంగానీ చేయకండి ! కావలిస్తే మరికొంచెం పెంచుకోండి !" అన్నారు, సబ్బునురగలు రుద్దుకొంటూ. అదేమి సబ్బోగానీ పెరడంతా గుప్‌మని సువాసన వెదజల్లుతోంది ! ఒక్కసారి రుద్దుకొంటే బావుణ్ణు ! అనిపించింది. అనూరాధ మా వంటింటి కిటికీ దగ్గర నిలబడి చాటుగా మా మాటలు వింటోంది. కొద్దిగా జరిగి వార్నింగిస్తూ నావైపు చూసింది.

"అదేనండీ ! ఈ నెలనుంచీ మరో ఫిఫ్టీ రుపీస్ ఎక్కువ చెయ్యాలనుకొంటున్నా !" అన్నా గట్టిగా అనూరాధకి వినిపించేలా.

"అలాగే చేద్దాం మాష్టారూ !" ఈజీగా అనేసారాయన, బాల్చీలోని నీళ్లు కిందకి గుమ్మరిస్తూ. వెంటనే అనూరాధ వైపు చూసా, ఆమె ఇనస్ట్రక్షన్స్‌కోసం. ఆమె మూతి వంకర్లు తిప్పుతూ లోనికి పోయింది.

"ఇలా కాదండీ ! మీ రుండడం మా కిష్టంలేదని నిర్మొహమాటంగా చెప్పెయ్యండి !" అంది భోజనం వడ్డిస్తూ.

అంత నిర్మొహమాటంగా చెప్పే శక్తి నాకు లేదు. అలా అంటే అనూరాధతో గొడవ.

"ఈ మాటు అలాగనే చెబుదాం ! నాలుగురోజులు పోనీ !" అన్నా అప్పటికా ప్రోబ్లెం టెంపరరీగా డ్రాప్ చేస్తూ.

అంతటితో తృప్తిపడి ఊరుకొంది అనూరాధ.

ఆ రోజునుంచీ కుక్కమీదా, పిల్లిమీదా పెట్టి మాటలు విసిరేది అనూరాధ.

"తప్పు అనూ ! పొమ్మంటే వాళ్ళే పోతారు ! సాటి స్త్రీని అలా అవమాన పరచకూడదు!" అనేవాడ్ని సౌమ్యంగా, ఆమెకు కోపం రాకుండా.

"మొగుడు వెయ్యిరూపాయిల జీతగాడని దానికి గర్వం ! క్లబ్‌లూ,

బీచ్ లూ, సినీమాలూ, షికార్లూ ఏమి పోకిరీ వేషా లేస్తుందని ? డబ్బుంటే మాత్రం అంత మిడిసిపాటా !" అంది గట్టిగా ఆమెకు వినబడేలా.

ఆ క్షణంలో అక్కడున్నందుకు నాకు చాలా సిగ్గేసింది. పాపం ఆమె ఎంత బాధపడుతోందో ! ఈ మాట బయటకంటే అనూరాధ చంపేస్తుంది. పరిష్కారమార్గంకోసం పరిపరివిధాల ఆలోచిస్తూ ఉండిపోయా. కాంపర్ మైజ్ ప్రశ్నే లేదు. 'ఇంటిలోని పోరు యింతింతగాదయా !' వేమన పద్యం జ్ఞాపకానికి వచ్చింది.

* * *

మా బాబాయికి సుస్తీగా ఉందనీ గుంటూరు జనరల్ హాస్పిటల్లో అడ్మిట్ చేసారని ఉత్తరం వస్తే బయలుదేరక తప్పిందికాదు. అనవసరంగా రమణితో తగువు పెంచుకోవద్దనీ మూడో రోజు కల్లా వచ్చేస్తాననీ చెప్పి బయలుదేరా. నాకు హాస్పిటలన్నా, జబ్బులన్నా చచ్చేంత భయం. ఆ వాసనే పడదు ! అంటీసెప్టిక్ లోషన్ల వాసన అయిదు నిమిషాలు చాలు ! తల తిప్పుతుంది. మా బాబాయి ఉన్నది మెడికల్ వార్డు కాబట్టి చాల నీట్ గా ఉంది. వార్డు అంతా రోగులతో నిండి ఉంది. బెడ్సు చాలక కొంతమంది రోగులు కిందపడుకొన్నారు. రకరకాల రోగాలు ! బతకాలనే ఆశ అందరికీ ! బాబాయితో ఓ గంట మాట్లాడాక రోగుల్ని చూడాలనిపించింది ...మూడో నెంబరు బెడ్ కి ఏమి జబ్బో తెలీదు చాలా సీరియస్ ఉంది కాబోలు! ఒక చీఫూ, ఇద్దరు అసిస్టెంట్లూ, ముగ్గురు నర్సులూ ఆ మంచం చుట్టూ మూగారు. హడావిడిగా ఉన్నారు. వారి మొహాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఆక్సిజన్ సిలిండర్ను తోసుకొని వెళ్తున్నాడు వార్డుబాయ్. పైవాళ్ళ నెవ్వరినీ దగ్గరగా వెళ్ళనీయటంలేదు. కొంచెం దూరంలో నిలబడి నేనూ చూసా. వయస్సు మళ్ళినాయనే ! అరవై పైనే ఉంటాయ్ ! ఒక స్త్రీ, అతని భార్య కాబోలు ! దుఃఖాన్ని మింగుకోవాలని వ్యర్థప్రయత్నం చేస్తోంది. ఆమె పక్కనే పదేళ్ళకుర్రాడు బెంబేలుపడి చూస్తున్నాడు. చినిగిపోయి, మాసిపోయిన చొక్కా, తైలసంస్కారంలేని జుత్తూ అతి దీనంగా ఉన్నాడు. వాళ్ళని చూడలేకపోయా. వెంటనే బాబాయి దగ్గర కొచ్చేసా కానీ నా దృష్టి అంతా బెడ్ నెంబరు త్రీమీదనే.

"అతను జాయిను అయి వారం రోజులు అయింది ! రిటైర్డ్ టీచరుట ! ఎనీమియా ! బాగా ముదిరిపోయింది !"

నే నడక్కుండానే చెప్పాడు బాబాయి.

"పాపం ! ఎలా ఉంటుందో ! ఆక్సిజన్ కూడా యిస్తున్నారు!" అన్నా సానుభూతిగా.

"అనూరాధనీ, పిల్లల్ని తీసుకొని రాలేకపోయావా ! చూసి చాలా రోజు లయింది !" అడిగారు.

"వచ్చే నెల్లో వస్తాం ! ముందు నన్ను వెళ్ళి మిమ్మల్ని చూసి రమ్మంది !" అన్నా ఆ బెడ్ వైపే చూస్తూ.

కొద్దినిమిషాలు మౌనంగా గడిచి పోయాయ్.

"వస్తా బాబాయ్ ! మళ్ళా రేపు వెళ్ళిపోవాలి !" అన్నా లేచి నిలబడుతూ.

"అదేవిట్రా ? రేపు ఆదివారమే కదా ?"

"అవును ! రేపుదయం మళ్ళా వస్తా ! మధ్యాహ్నం వెళ్ళిపోతా." అని చెప్పి బెడ్ నెంబరు త్రీవైపు మరోసారి చూసి బయటకు వచ్చేసా. ఉపాధ్యాయులంటే నాకు అభిమానమూ, గౌరవమూను. కారణం ఏదైనా కావచ్చు ! "ప్రతి పౌరున్నీ తీర్చిదిద్దే మొట్టమొదటి అవకాశం వారికే ఉంటుంది !" అనే కావచ్చు. తక్కువ ప్రతిఫలంతో, ఎక్కువ బాధ్యతలతో సతమతమవుతూ ఉంటారనే కావచ్చు ! ఏమైతేనేం ! రిటైర్డ్ టీచర్సు ఎవరైనా వచ్చి సహాయం అర్థిస్తే ఆనందంతో సహాయం చేస్తా. ఆ నిర్భాగ్యుడికి ఎలా ఉంటుందోనన్న బెంగ పట్టు కొంది. సాయంత్రం ఆరయింది. సినిమా కెళ్ళాలని హాలుదగ్గర క్యూలో నిలబడ్డా. మనసు బాగులేక బయటకు వచ్చేసా. బజారు కెళ్ళి నాలుగు బత్తాయి పళ్ళూ, రెండు ఆపిల్సూ, కొన్ని ద్రాక్ష పళ్ళూ కొని యింటికిపోయా. రాత్రి సరిగా నిద్రపట్టలేదు. ఆ మాష్టారి మొహమే కన్పించేది.

మర్నా డుదయమే లేచి పళ్ళను బేగ్‌లో వేసి హాస్పిటలుకు బయలుదేరా. అలాగే విశాఖపట్నం వెళ్తున్నానని పిన్నికి చెప్పా. వార్డులో అడుగు పెడుతూనే బెడ్ నెంబరు త్రీవైపు చూసా ఆత్రుతగా. ఆ బెడ్ చుట్టూ కర్టెన్లు కట్టి ఉన్నాయ్ ! దగ్గరగా వెళ్ళి చూసా. ఆ యిల్లాలు స్టూలుమీద కూర్చొని మాష్టారి పాదాలమీద తల ఆన్చుకొని శోకిస్తోంది. మాష్టారి శరీరం అంతా తెల్లని దుప్పటితో కప్పబడి ఉంది. కాళ్ళు వణికాయ్. చేతిలోని సంచీ చాలా బరువుగా తోచింది.

"మాష్టారూ !" అని కేక వేసా ఆవేశంగా.

ఆమె వెనక్కు తిరిగి నావైపు చూసింది. అపరిచిత వ్యక్తులం ! అదోలా చూసుకొన్నాం.

"మాష్టారు మనల్ని వొదిలిపోయారు బాబూ !"

గట్టిగా శోకాలు తీయడం ప్రారం భించిందామె. ఆమె గొంతు బొంగురు



పోయింది. కళ్ళు లోతుకుపోయాయ్ ! చిరుగుల చీర ! దుర్భర దారిద్ర్యం అనుభవిస్తూన్నట్లు తెలుస్తోంది. ఎలా ఓదార్చాలో తెలియలేదు. నాకూ కళ్ళు చెమ్మగిల్లాయ్. ఆ ఊరిలో బంధువులున్నారో లేదో ? అసలు ఏ ఊరో ? బంధువులుంటే ఎందుకు రారు ? మరి దహనసంస్కారం ?

ఇంతలో స్టాఫ్ నర్సు వచ్చింది ఉరుకులూ, పరుగులూ వేసుకొంటూ.

"ఎలాగమ్మా ? డెడ్ బాడీని తీసెయ్యాలి ! ఛీఫ్ వచ్చేవేళయింది ! చూసారంటే కోప్పడతారు ! ఇప్పటికే చాలా ఆలస్యం అయింది !"

తొందర చేసిందామె నిర్దయగా.

నా క్రోపం వచ్చింది ఆమె ప్రవర్తనకు.

"అదేంటి సిస్టర్ ! అంత తొందర పడతారు ?" అన్నా కల్పించుకొంటూ.

"తొందరా?" అంటూ కనుబొమలు

చిట్లించి ఆమె నావైపు కోపంగా చూసింది.

"రాత్రి పదకొండుగంటలకు పోయా డాయన! ఇంతవరకూ ఉండనిచ్చాం !" అంది ఎంతో కన్సిడరేషన్ యిచ్చి నట్లుగా మొహంపెడుతూ.

నే నేమీ మాట్లాడలేకపోయా. అవును వారి డ్యూటీ అది ! మానవత్వం ఉన్నా చంపుకోవాలి ! వారి రూల్సు వారివి !

"మీ వారెవ్వరూ రాలేదామ్మా ?" అడిగింది సిస్టర్ తగ్గుస్వరంతో.

"వస్తారమ్మా వస్తారు ! కూతురూ, అల్లుడూ ఈ ఊళ్ళోనే ఉన్నారు ! మా అబ్బాయి వెళ్ళాడు తీసుకొని రావడానికి !" ఏడుస్తూనే చెప్పిందామె.

"ఏమో ! మరో అయిదు నిమిషాలు చూస్తాం ! ఎవ్వరూ రాకపోతే ఐసు కొట్లో పడేస్తాం !" అనేసి నిర్లక్ష్యంగా వెళ్ళింది స్టాఫ్ నర్స్

"ఎంత నిర్భాగ్యపు చావు వచ్చిం దండీ ! ఆరుగుర్ని కన్నాను!" రాగాలు ప్రారంభించిందామె.

"చూడండమ్మా ! మీ అల్లుడిగారి అడ్రస్సు చెప్పండి ! నే వెళ్ళి తీసు కొస్తా !" అన్నా.

"ఆ వివరాలు నాకు తెలియవు బాబూ ! మాది ఈ ఊరు కాదు...మా ఆఖరి కుర్రాడు గంటక్రితం వెళ్ళాడు ! వస్తూనే ఉంటారు !" అంది మొహమూ, కళ్ళూ చీరచెంగుతో తుడుచుకొంటూ.

కొంతసేపు వెయిట్ చేసా. ఎవ్వరూ రాకపోవడంతో ఆత్రుతా, కంగారూ ఎక్కువయ్యాయ్! ఏమిటో అనుబంధం! మన కెందుకులే అని సరిపెట్టుకో లేకపోయాను. సంచీని బాబాయి దగ్గరుంచి మెయిన్‌గేటు దగ్గరకు గబగబా నడిచా.

"ఆయన నీకు తెలుసు నేవిట్రా ?" అన్న బాబాయి ప్రశ్నకు జవాబు చెప్ప లేదు. మెయిన్‌గేటుకు అవతల వచ్చేవాళ్ళనందర్నీ పరికిస్తూ నిలబడ్డా. నిన్న చూసిన కుర్రాడికోసం నా కళ్ళు వెతుకుతున్నాయ్ ! మేష్టార్ని ఐసు కొట్లో పడేస్తారేమో నన్న భయం పీడిస్తోంది.

కొంతసేపటికి ఆ కుర్రాడు కన్పిం చాడు. చిన్నసైజు పరుగుతీస్తున్నాడు. అతనివెంట మరో ముగ్గురు గబగబా నడుస్తున్నారు...ఇరవై యేళ్ళ యువతి! కూతురై ఉంటుంది ! మరొకడు అల్లుడు ! మూడోవాడు ? ఎవరో ?

ఎదురుగా వెళ్ళి అడిగా-

"మాష్టారి తాలూకు మీరేనా ?" అని.

'అవునంటూ' లోపలికిపోయారు నన్ను చూడకుండానే. నేనూ వాళ్ళని అనుసరించా. శవం బెడ్‌మీదనే ఉంది. కూతుర్నీ, అల్లుణ్ణీ చూసి ఆమె మరలా ఏడుపు మొదలుపెట్టింది ... ఏమి

చేయాలో తోచక అటూ ఇటూ చూసాడు మాష్టారి అల్లుడు. వెనుక నిలబడి ఉన్న నన్ను చూసి-

"ఏం చేయాలి ?" అడిగాడు.

నన్ను నేనే పరిచయం చేసుకొన్నా. మాష్టారి శిష్యుణ్ణిని చెప్పుకొన్నా.

"ముందు డెడ్‌బాడీని యిక్కడ్నుంచి తరలించాలి! బాగా ఆలస్యం అయిందని హాస్పిటలువాళ్ళు గొడవచేస్తున్నారు !" అన్నా.

నేలచూపులుచూస్తూ ఉండిపోయాడు.

"ఎలా తీసుకెళ్లం ?" తలెత్తి అడిగాడు.

అతనికి అనుభవం లేదులా ఉంది ! కనీసం చూడనైనా లేదేమో !

"టాక్సీని మాట్లాడండి !" అన్నా.

అతను కొంచెం దూరంగా నడిచి నన్ను తన దగ్గరకు రమ్మన్నాడు, ఏదో అడగాలనే ఉద్దేశంతో. డబ్బుకోసం ఆలోచిస్తున్నట్లుగా తోచింది...దగ్గరగా వెళ్ళాక అన్నా డతను.

"టాక్సీ అయితే ఎక్కువడుగు తాడేమో !"

"ఎంత దూరం మీ యిల్లు ?"

ఏదో చెప్పాడు.

"ఊళ్ళోనేకదా ! కాకపోతే డెడ్‌బాడీ కదా అని ఎక్కువడుగుతాడు ! ఎంతయినా పాతిక రూపాయిలకన్నా ఎక్కువడగడు !" అన్నా.

"పాతిక రూపాయిలుండాలంటారా?" అన్నాడు నిస్పృహగా.

"ఆ డబ్బు నే నిచ్చుకొంటా ! ఆ విధంగానైనా మాష్టారి ఋణం కొంతయినా తీర్చుకొన్నట్లుంటుంది !" అనేసా అనాలోచనగా.

అతని కళ్లు కృతజ్ఞతతో మెరిసాయ్!

అవతలికిపోయి టాక్సీని బేరంచేసి తీసుకొచ్చా. శవాన్ని డిక్కీలో పడేసాం. మాష్టారి అబ్బాయీ, అల్లుడూ ముందుసీట్లో కూర్చున్నారు. భార్యా, కూతుర్ని వెనుకసీట్లో కూర్చోబెట్టాం. నా పక్కనే నిలబడ్డాడు వారితో వచ్చిన మూడో వ్యక్తి. టాక్సీకి డబ్బు చెల్లించి "మరి నే వస్తానండీ !" అన్నా.

"ఒరేయ్ భాస్కరం ! బావలకి ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం యియ్యి !" చెప్పాడు మాష్టారి అల్లుడు నా పక్కనే నిలబడ్డ అతనితో.

"మీ సహాయానికి చాలా థాంక్స్!" అన్నాడు నన్ను చూస్తూ, టాక్సీ కదులుతూండగా...

"నే వెళ్ళి టెలిగ్రాం యిస్తా సార్!" అన్నాడు భాస్కరం—

"డబ్బుందా ?" అనుమానంగా అడిగా.

ఉన్నాయన్నట్లు తలూపుతూ జేబులో ఉన్న డబ్బంతా చేతిలోకి తీసుకొని లెక్కపెట్టాడు ... "మూడురూపాయిల

ఎనభై పైస లున్నాయ్ సార్ !" అన్నాడు.

"అర్ధనరీ టెలిగ్రాంకే చాలదు ! నేనూ వస్తానుండు !" అని చెప్పి మా బాబాయి దగ్గర కెళ్ళా.

నావైపు అదోలా చూసాడు మా బాబాయి, అతని ప్రశ్నకు జవాబు చెప్పనందుకేమో !

"ఆయన నా ఫ్రెండ్ నాన్నగారు !" అని బొంకా.

"అలాగా !" అన్నారు సంతృప్తిగా.

ఆయన దగ్గర పెట్టిన సంచీని తీసుకొని విశాఖపట్నం వెళ్ళిపోతున్నానని చెప్పి బయలుదేరా.

నేనూ, భాస్కరమూ రిక్షా ఎక్కి టెలిగ్రాఫ్ ఆఫీసుకు బయలుదేరాం ... దారిలో మాష్టారి విషయాలు అడిగి తెలుసుకొన్నా.

అతను మాష్టారి అల్లుని తమ్ముడట! నిరుద్యోగి. మాష్టారు రిటైరయి అయిదు సంవత్సరాలకి పైగా అయిందిట ! నలుగురు మగపిల్లలూ, యిద్దరాడపిల్లలూ ! పెద్దపిల్ల లిద్దరికీ కాలేజీ చదువులు చెప్పించారుట. ఆడపిల్ల లిద్దరికీ పెళ్ళిళ్ళు చేసారుట! పెద్దబ్బాయి లిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారుట ! పెద్దవాడికి విశాఖపట్నంలో ఉద్యోగమట ! పెద్ద ఉద్యోగమే అయినా కానీ పంపట్ట ! రెండోవాడు అత్తవారి ఊరికి బదిలీ చేయించుకొని వారిలో కల్సిపోయాట్ట ! అతను ఉత్తరాలే రాయట్ట! రిటైరయిన తర్వాత నాలుగు సంవత్సరాలదాకా ప్రయివేట్లు చెప్పుకొని కాలక్షేపం చేసార్ట ! ఒక సంవత్సరంనుంచీ జబ్బు ప్రవేశించిందిట ! పాతిక రూపాయలు పెన్షన్ వస్తుందిట ! మాష్టారి భార్య ఆ ఊరి కరణం గారింట్లో పనిచేసి నెలకు పాతిక రూపాయిలు తెస్తుందిట ! అదే వారి ఆదాయం. అల్లుడికి గుంటూరులో చిన్న ఉద్యోగం ! సహాయం చేయలేని స్థితి ! నానా పస్తులూ పడి దుర్భర దారిద్ర్యం అనుభవించారుట ఆఖరి దశలో – ఇదీ అతను దారిలో చెప్పిన విషయాల సారాంశం.

"చాలా జబ్బుగా ఉందనీ బతకడం కష్టం అనీ అందరికీ యిదివరకే ఉత్తరా రాయకపోయారా ?" అడిగా అంతా విన్నాక.

"నాలుగురోజులక్రితం రెండోసారి ఉత్తరం రాసాం సార్ ! నిన్న అందరికీ టెలిగ్రాములు కూడా యిచ్చాం !"

చెప్పాడు భాస్కరం.

ఇహ అతణ్ణి అడగాల్సిన విషయాలేవీ లేవు ! టెలిగ్రాఫ్ ఆఫీసు వచ్చింది. గబగబా కౌంటరు దగ్గరకెళ్ళి రెండు ఫారాలు తీసుకొని మేటరు రాసా.

"యువర్ ఫాదర్ ఎక్స్పయిర్డ్ స్టార్ట్ ఇమీడియట్లీ"-భాస్కరం.

పెద్దబ్బాయిల యిద్దరి ఎడ్రస్సూ చెప్పమన్నా.

మొట్టమొదట మాష్టారి పెద్దబ్బాయి ఎడ్రస్సు చెప్పాడు. నాలోని నవ నాడులూ కృంగిపోయాయ్ ! పక్క నే ఉన్న కుర్చీలో కూలిపోయా ! మాట రాలేదు ! అతనూ నా ప్రక్కనే కూర్చొన్నాడు మౌనంగా. కొంత సేపటికి తేరుకొని అడ్రస్సులు రాసి బుక్ చేయించి బయటకు వచ్చేసాం ! రశీదులు అతని చేతిలో పెట్టి.

"మీ రెళ్లండి !" అన్నా. అతను కళ్ళతోనే థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు.

సంచీపట్టుకొని బరువుగా నడక సాగించా. ఎలాగో నానా తిప్పలూ పడి నాలాగే బరువుగా వాల్తేరు స్టేషనుకు జేర్చింది ఎక్స్‌ప్రెస్. మాష్టారికోసం కొన్న పళ్ళు సంచీతోసహా ట్రైన్‌లోనే వదిలేసా ! అవి మాష్టారికోసం కొన్నవి. నేను చూస్తూండగా మరొకరు తింటూంటే సహించలేను. ఇల్లు చేరేసరికి బాగా రాత్రి అయింది. గేటులో అడుగు పెడుతూనే రఘురాంగారి వాటాలోకి చూసా. లైట్లు వెలిగి ఉన్నాయ్ ! మా యింటి తలుపులు తట్టగానే అనూరాధ తలుపులు తీసింది.

"రఘురాంగారు ఎక్కడికీ వెళ్ళ లేదా ?" అడిగా అడుగు వెనక్కు వేస్తూ, ఆమె నన్ను తాకుతుందనే భయంతో.

"ఎలా ఉందండీ మామయ్యగారికి?" అడిగిందామె. నా ప్రవర్తనకి కీడు శంకిస్తూ.

"ఆయన బాగానే ఉన్నారు ! రేపో యెల్లుండో డిస్చార్జి చేస్తారు ! రఘురాం గారు ఇంట్లోనే ఉన్నారా ?" మరలా అడిగా.

"ఆఁ ! ఎక్కడికో తెల్లవారు ఝామునే వెళ్ళి ఇప్పుడే తగులడ్డారు !" అంది ఆమె ధోరణిలో.

ప్రయాణికపు బడలికగా ఉందనీ వేడినీళ్ళు పెట్టమనీ చెప్పి రఘురాం గారింట్లోకి వెళ్ళా.

"రండి మాష్టారూ !" సాదరంగా ఆహ్వానించారు రఘురాంగారు. రమణి రేడియో వింటూ నన్ను గమనించనే లేదు. పైన సీలింగు ఫేను గిరగిరా తిరుగుతోంది. వారిలో ఏ విధమైన ఆందోళనా కనబడలేదు ! టెలిగ్రాం అందలేదేమో అనుకొంటూ కుర్చీలో కూర్చున్నా.

"మీ కేమీ టెలిగ్రాం అందలేదా ?" అడిగా.

నా మాటలు విన్న రమణి కుర్చీ లోంచి లేచినిలబడింది.నాకు సమాధానం చెప్పకుండా భార్యవైపు చూసారు రఘురాంగారు.

"అవునండీ ! నిన్న ఉదయం వచ్చింది ! మన అరకు ప్రోగ్రాం

కాన్సిలవుతుందని చెప్పలేదు ! ఎప్పుడూ ఉన్నదేగా ! కాకపోతే యిప్పుడు సీరియస్‌గా ఉందని టెలిగ్రాంవచ్చింది!" అంది భర్తవైపు విలాసంగా చూస్తూ.

...నాకే అధికారం ఉంటే ఆమెని ఆ చెంపా. ఈ చెంపా వాయించి ఉండే వాణ్ణి ! ఇంతలో మా రెండోవాడు వచ్చాడు, మరో టెలిగ్రాం పట్టుకొని.

"మధ్యాహ్నం రఘురాంగారికి టెలిగ్రాం వచ్చింది నాన్నగారూ ! వారు లేరు. మమ్మల్ని తీసుకోమని వారు వచ్చాక ఈయమన్నాడు ! వారు యిప్పుడే వచ్చారు ! అమ్మ ఈయమంది !" అంటూ రఘురాంగారికి టెలిగ్రాం అందించి వెళ్ళిపోయాడు.

"చూడండీ రఘురాంగారూ ! రాత్రి పదకొండు గంటలకి మీ నాన్నగారు పోయారు ! అదీ ఆ టెలిగ్రాం ! నిన్న వెళ్ళుంటే ఆఖరి చూపయినా దక్కుండేది !" అన్నా కఠినంగా.

టెలిగ్రాం చదువుతూంటే రఘురాం గారికి చేతులు వణికాయ్ ! కళ్ళు చెమర్చాయ్ ! టెలిగ్రాం భార్యకు అందించబోయారు.

"చూడ్డానికేముంది ! ఆయన చెప్పారుగా, చనిపోయారని !" అంటూ లోనికి పోయింది.

నా కక్కడ కూర్చోబుద్ధి పుట్టలేదు. తిన్నగా బాత్‌రూమ్‌లోకి పోయి స్నానం చేసా.

నన్ను చూసి ఆశ్చర్యపోయింది అనూరాధ.

"అదేవిటండీ ! తలకి స్నానంచేసి బట్టలన్నీ తడిపేసారూ వాగాయిత్యం వోడుకొంటూ !"

విసుక్కొంది కూడా.

ఎందుకో అనూరాధకి నిజం చెప్పాలనిపించలేదు! ట్రైనులో ఓ నిర్భాగ్యుడు పోయాడనీ శవాన్ని తాకాననీ బొంకాను

మరి మాట్లాడలేదు అనూరాధ.

పెట్టెలో బట్టలు తీసుకొని కట్టుకొని వీధి గుమ్మంలోకి చూసా. రఘురాం— రమణీ యిద్దరూ రిక్షా ఎక్కుతున్నారు.

